క్లుప్తంగా

అభయ ప్రసన్నాంజనేయ స్వామికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండల కేంద్రం మర్రిపాడులోని శ్రీఅభయ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో 3వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేదర మెట్ల వెంకటప్రసాద్ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. బద్వేల్‌కు చెందిన కనుమళ్ల సత్యనారాయణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మేకపాటి పరామర్శ



ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురంలో ఇటీవల హఠాన్మరణం చెందిన ముటుకుందు అరుణ ఉత్తరక్రియలకు గురువారం వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, మేకపాటి అభినవ్‌రెడ్డి హాజరై వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అరుణ భర్త ముటుకుందు మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీరెడ్డి, కొండారెడ్డి, సిద్దారెడ్డి, నరసారెడ్డి, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. అరుణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వలంటీర్ల సమావేశానికి మేకపాటి రాక

వరికుంటపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని అన్ని సచివాలయాల వలంటీర్లతో జరిగే సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి పాల్గొంటారని ఆ పార్టీ మండల కన్వీనర్ ఆండ్రా బాలగురవారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు హాజరు కావాలని తెలిపారు.

6 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

జలదంకి: మండలంలోని బీకే అగ్రహారం కాకమ్మ చెరువులోని మైదానంలో ఈ నెల 6వ తేదీ నుంచి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వంటేరు వరదారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి ఆర్థికసాయంతో ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగే ఈ పోటీల్లో మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేల చొప్పున అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 5వ తేదీ లోపు తమ జట్ల పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9700999203, 8499988194 సెల్‌నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రావిపాడులో పశువైద్య శిబిరం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరు సచివాలయ పరిధిలోని రావిపాడులో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. రైతులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం జరిపారు. గ్రామంలో పశువులకు ఉచితంగా గొంతువాపు టీకాలు వేశారు. పశుపోషకులకు గడ్డి పెంపకం, పశువుల దాణా వినియోగం, గొంతువాపు టీకాల గురించి చాకలికొండ పశువైద్యాధికారి కొమ్మి కోటేశ్వరరావు వివరించారు. ఎస్సీ పాడి రైతులకు రూ.4కే పశుదాణా ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు మహేష్, హాజరత్తయ్య, కృష్ణ, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించండి

ఆత్మకూరు: పట్టణంలోని సోమశిల రోడ్ ప్రాంతంలో వక్ఫ్‌బోర్డు స్థలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని, వాటిని వెంటనే తొలగించాలని జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సోమశిల రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను దర్గా సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ముందస్తుగా ఎలాంటి సమాచారం తెలపకుండా విద్యుత్‌శాఖ అధికారులు హైటెన్షన్ విద్యుత్ లైన్ స్తంభాలు ఏర్పాటు చేయడంతో భవిష్యత్‌లో వక్ఫ్‌బోర్డు స్థలాల్లో వారికి ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఆయన వెంట ఈద్గా, దర్గా ముజావర్లు, ఇమామ్‌లు ఉన్నారు.

పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకం

- వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


కలిగిరిలో మాట్లాడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: రాష్ట్రంలో పేదల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో గ్రామ వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. కలిగిరిలోని ఆవుల రమణారెడ్డి కల్యాణ మండలంలో గురువారం గ్రామ వలంటీర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రజలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తమ కుటుంబంలో పెద్ద కొడుకుగా, వలంటీర్లను చిన్న బిడ్డలుగా ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వలంటీర్ల కృషితో గ్రామాల్లో లక్షలాది వృద్ధులు, కోవిడ్ బాధితులు మృత్యువాత పడకుండా కాపాడుకోగలిగామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న వలంటీర్ల వ్యవస్థను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు తమ రాష్ట్రాల్లో ఈ వ్యవస్థను అమలు చేసేందుకు సన్నాహాలు చేస్తుండడం శుభపరిణామన్నారు. 2024లో మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్లకు మరింత సముచితస్థానం దక్కుతుందన్నారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఏ ఇంటికి వెళ్లినా వలంటీర్ల పనితీరును ప్రజలు కొనియాడుతున్నారన్నారు. ప్రజల్లో మనుగడ కోల్పోతున్న ప్రతిపక్షాలు, ఇతర నాయకులు వలంటీర్లపై చేసే ఆరోపణలను పట్టించుకునే నాథుడే లేరన్నారు. వలంటీర్లకు ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎళ్లవేళలా బాసటగా నిలుస్తారన్నారు. నాయకుడు మేకపాటి అభినవ్‌రెడ్డి సచివాలయాల వారీగా వలంటీర్లతో సమీక్ష జరిపారు. వలంటీర్లకు పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, పీఏసీఎస్ చైర్మన్లు ములకా శ్రీనివాసులురెడ్డి, బొర్రా మస్తాన్‌రెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ రాగి దివ్య, ఉప సర్పంచ్ పాలూరు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన శాంతిభద్రతలే లక్ష్యం

- డీఎస్పీ కోటారెడ్డి


మాట్లాడుతున్న డీఎస్పీ కోటారెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో మెరుగైన శాంతిభద్రతలే లక్ష్యంగా అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బంది సమష్టిగా పనిచేస్తున్నారని డీఎస్పీ ఎన్.కోటారెడ్డి తెలిపారు. మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌ను ఆత్మకూరు సీఐ జి.వేణుతో కలిసి గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నివారణ, కేసుల పురోగతి తదితర అంశాలకు సంబంధించి పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసి సిబ్బంది అవసరమైన సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. మర్రిపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. మండలంలోని డీసీపల్లిలో బ్రిటిష్ హయాంలో నిర్మించిన పోలీస్‌స్టేషన్ మండల వ్యవస్థ ఏర్పాటు తరువాత మర్రిపాడుకు తరలించారని, అక్కడ ఉన్న పోలీస్‌స్టేషన్ స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా చూస్తామని తెలిపారు. అలాగే మండలంలోని బ్రిటిష్ హయాం నాటి దొర్నాల (బాట సింగనపల్లి) పోలీస్‌స్టేషన్ స్థలాన్ని కూడా సంరక్షించేందుకు చర్యలు చేపడతామన్నారు. 67వ నంబర్ జాతీయ రహదారి వెంబడి ప్రమాదాల నివారణకు మరిన్ని చర్యలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై విశ్వనాథరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పనిచేయాలి

- ఆర్వో సువర్ణమ్మ


సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్వో సువర్ణమ్మ

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలోని ఏఈఆర్వోలు, బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి సువర్ణమ్మ పేర్కొన్నారు. గురువారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిబ్బంది ఓటర్ల నమోదు ప్రక్రియ, జాబితా తయారీల ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించని సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటి వరకు సిబ్బంది చేపట్టిన ఓటర్ల ప్రక్రియను అడిగి తెలుసుకుని వారికి సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తయారు చేద్దాం

- సెబ్ ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి


మాట్లాడుతున్న సెబ్ ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే నష్టాలపై గురువారం ఆత్మకూరు పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీసులు, సెబ్ అధికారులు కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రమాదకరమైన డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఆరోగ్యం చెడిపోవడంతో పాటు ఆర్థికంగా నష్టపోకతప్పదని, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాలను కలిగి ఉన్నా, రవాణా చేసినా, వినియోగించినా తీవ్రనేరమని వివరించారు. డ్రగ్స్ గురించి సమాచారం తెలిస్తే అధికారులకు తెలపాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. విద్యార్థులను మాదక ద్రవ్యాలకు అలవాటు చేసేందుకు కొన్ని ముఠాలు పనిచేస్తుంటాయని, వారి పట్ల అప్రత్తంగా ఉండాలని సూచించారు. నేరాలపై ఎలాంటి సమాచారం ఉన్నా టోల్‌ఫ్రీ 14500 ఫోన్ చేసి చెప్పవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సెబ్ సీఐ బి.నయనతార, ఎంఈఓ షేక్ నజీర్‌బాషా, ఎస్సై బి.రాజేష్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్స్ పిల్లలను బడిలో చేర్చాలి


వెన్నవాడ సచివాలయంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: బడి ఈడు పిల్లలు బడి బయట ఉంటే పాఠశాలల్లో చేర్చేలా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చొరవ చూపాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. ఆత్మకూరు మండలంలోని కరటంపాడు, వెన్నవాడ, బోయలచిరువెళ్ల సచివాలయాల పరిధిలో గురువారం ఆయన సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చిన్నారులు బడికి వెళ్లి చదువుకోవడం ద్వారా వారి భవిష్యత్ బాగుంటుందని, దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఎంఈఓ–2 చలపతి మాట్లాడుతూ 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ పాఠశాలల్లో చేరేలా సమీపంలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలన్నారు. ఎక్కువ కాలం పాఠశాలలకు వెళ్లని విద్యార్థులను గుర్తించి ఓపెన్ స్కూల్‌కు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలోనూ విద్యార్థుల చేరికలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఆత్మకూరు మండలంలో 128 మంది బడి బయట పిల్లలు ఉన్నారని, వారందరినీ పాఠశాలలకు పంపేలా సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కరటంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాలకొండలరావు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలి

చేజర్ల: ఉపాధ్యాయులు బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకుని విద్యార్థులకు ఉత్తమ బోధనను అందించేందుకు ప్రయత్నించాలని ఎంఈఓ–2 మస్తానయ్య సూచించారు. గురువారం చేజర్ల మండలంలోని ఆదూరుపల్లి స్కూల్ కాంప్లెక్స్‌లో సోషల్ ఉపాధ్యాయులకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే చేజర్లలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంఈఓ కళాధర్ పాల్గొని పలు సూచనలు చేశారు. కలువాయి, చేజర్ల మండలాల్లోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే రేవూరు హైస్కూల్‌లో ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం హైస్కూల్స్ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈఓ బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ–2 కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొని ఉపాధ్యాయులకు బోధనపై పలు సూచనలిచ్చారు.

వైఎస్సార్ వర్ధంతికి సేవా కార్యక్రమాలు

చేజర్ల: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌కు నివాళులర్పించడంతోపాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

డ్రోన్ ద్వారా రీసర్వే


డ్రోన్ సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సంగం: మండల కేంద్రం సంగంలో గురువారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సర్వేయర్‌తోపాటు ప్రత్యేక బృందం డ్రోన్ ద్వారా భూముల రీసర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రీసర్వేలో భాగంగా వ్యవసాయ భూమితోపాటు స్థిరాస్తులను సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం డ్రోన్ ద్వారా ఛాయాచిత్రాలు తీస్తున్నామని, అనంతరం రైతుల వద్దకు వెళ్లి వివాదాల పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సర్వేయర్ సుందర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు 32వ వార్డులో 'గడప గడపకు..'

కావలి: పట్టణంలోని 32వ వార్డు వడ్డిపాళెంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలి పట్టణంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు, నాయకులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అనుబంధ విభాగాల సభ్యులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఫెన్సింగ్ తొలగించారని ఫిర్యాదు

కలిగిరి: వ్యవసాయ భూమికి సంబంధించిన ఫెన్సింగ్‌ను అక్రమంగా తొలగించారని కృష్ణారెడ్డిపాళెం సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము నివాసం ఉండే వ్యవసాయ పొలం వద్ద భూముల హద్దుల విషయంలో ఒక వ్యక్తితో వివాదాలు ఉన్నాయని, తమకు ఎలాంటి నోటీసులు అందకుండా పోలీసులు, రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా, ఇంట్లో ఎవరూ లేని సమయంలో కొంతమంది జేసీబీ సహాయంతో తాము వేసిన ఫెన్సింగ్‌ను తొలగించారని ఆమె వివరించారు.

148 మందికి పింఛన్ల మంజూరు

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 148 మందికి వివిధ రకాల పింఛన్లు నూతనంగా మంజూరయ్యాయని ఎంపీడీఓ ఎ.మధుసూదనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పింఛన్లను శుక్రవారం నుంచి ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగుల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తామని తెలిపారు.

5న మర్రిపాడు మండల సమావేశం

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అజెండాలోని పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సాయిప్రసాద్

కావలి: ఖైదీలు జైలు నుంచి విడుదలైన అనంతరం నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని లీగల్ ఎయిడ్ సభ్యుడు ఐ.సాయిప్రసాద్ సూచించారు. కావలిలోని సబ్ జైలులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ సభ్యుడు సాయిప్రసాద్ మాట్లాడుతూ ఖైదీలకు పలు చట్టాల గురించి వివరించారు. సమాజంలో చెడు ప్రభావాలను విడిచి మంచిగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ చిన సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

కావలి: ఏబీవీపీ కావలి నూతన కార్యవర్గాన్ని నెల్లూరు జిల్లా కన్వీనర్ మల్లవరపు అశోక్‌రెడ్డి గురువారం ఏర్పాటు చేశారు. కావలి పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నూతన కార్యవర్గం కావలి అధ్యక్షుడిగా సాధనాల దామోదర్‌నాయుడు, కార్యదర్శిగా మనువర్ధన్, సహాయ కార్యదర్శిగా వినయ్, ఉపాధ్యక్షుడిగా సతీష్, హాస్టల్ కన్వీనర్‌గా అనిల్, కోకన్వీనర్‌గా మల్లికార్జున, సోషల్ మీడియా కన్వీనర్‌గా వెంకటరత్నం, కోకన్వీనర్‌గా వేణు, ఎస్‌ఎఫ్‌ఎస్ కన్వీనర్‌గా మదన్, టెక్నికల్ కన్వీనర్‌గా హరీష్, కోకన్వీనర్‌గా పవన్, నగర కార్యవర్గ సభ్యులుగా కార్తీక్, రాము, రిషి, నవీన్, మనోజ్, చరణ్ తదితర 25 మందిని నియమించినట్లు తెలిపారు. భాగ కన్వీనర్ త్రినాథ్, నాయకులు పాల్గొన్నారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు



కావలి: పట్టణంలోని 8వ వార్డు పురపాలక ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు గురువారం రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ఎన్‌సీసీ కేర్ టేకర్ కేవీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు రాఘవరావు మాట్లాడుతూ రక్తగ్రూపు నిర్ధారణ, రక్తదానంపై అవగాహన కల్పించారు. రెడ్‌క్రాస్ సిబ్బంది పద్మావతి, శేషమ్మ రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేసి గుర్తింపు కార్డులు అందజేశారు.

స్టడీ మెటీరియల్ అందజేత



చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు దీప్తి స్టడీ మెటీరియల్, 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను హెచ్ ఎం .సురేష్ పంపిణీ చేశారు. గణిత ఉపాధ్యాయుడు కృష్ణారెడ్డి సమకూర్చిన ఈ స్టడీ మెటీరియల్‌ను గురువారం హెచ్‌ఎం విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఉపకరిస్తుందని హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, రమణరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

చేజర్ల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

చేజర్ల: చేజర్లను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం చేజర్లలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. చేజర్ల పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అనంతరం అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ బషీర్, ఉప సర్పంచ్ ఉడతా పుల్లయ్యయాదవ్, ఈఓపీఆర్డీ రామయ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం


జన్మించిన శిశువును అందజేస్తున్న 108 సిబ్బంది

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గర్భిణి సంగీతను కాన్పు కోసం 108 వాహనంలో గురువారం వేకువజామున ఉదయగిరికి తరలిస్తున్నారు. ఉదయగిరి మండలం గండిపాళెం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి సంగీతకు పురిటినొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది వాహనంలోనే కాన్పు చేశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని 108 సిబ్బంది మసూద్, రాజఖాన్ తెలిపారు.

సచివాలయాలను తనిఖీ చేసిన ఆర్డీఓ


రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

చేజర్ల(సోమశిల): మండలం కేంద్రం అనంతసాగరంలోని సచివాలయం–1, సచివాలయం–2లను ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది క్రమం తప్పకుండా యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు ఎంతవరకు జరిగాయనే వివరాలపై ఆరా తీశారు. సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రదీప్ ఉన్నారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు


ఉదయగిరి: రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి

ఉదయగిరి: మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వయస్సుతో సంబంధం లేకుండా సోదరీమణులు సోదరులకు రాఖీ కట్టారు. అలాగే పట్టణంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులకు రాఖీలు కట్టారు. స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం భగవంతుని సందేశంతో కూడిన బ్రోచర్లు, పాకెట్ క్యాలెండర్లు అందజేశారు.

కొండాపురం మండలంలో..

కొండాపురం: మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ పౌర్ణమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. కొమ్మి, కొండాపురం, సత్యవోలు తదితర గ్రామాల్లో సోదరీమణులు సోదరులకు రాఖీలు కట్టారు. ఒకరికొకరు రక్షగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

ఉదయగిరి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారులకు గురువారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి సిప్రా, గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి శివకల్పన వైద్యపరీక్షలు నిర్వహించారు. బరువు తక్కువ ఉన్న చిన్నారులను గుర్తించి అవసరమైన మందులు అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి

ఆత్మకూరు: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.